# [illegible]

సీరియల్



ముద్దా సురేష్

## (పదహారవ భాగం)

తనకు తిరిగి వ్యాధిసోకే ప్రమాదం ఎలాగూ లేదుగా? దానివైపు నిదానంగా నడవడం ప్రారంభించాడు రాణా, మరమనిషిలా. నాలుగైదు గజాలు ముందుకు వెళ్లే సరికి గ్లోవ్స్ ధరించిన ఓ హస్తం అతని భుజంమీద బరువుగా పడింది, విసురుగా వెనక్కి లాగుతూ.

"నువ్వేం చేస్తున్నావో నీకు తెల్సా?" కోపంగా అరిచాడు అశ్వత్థామ.

పరుగు పెట్టడంవల్ల ఆయన ఛాతీ ఎగిసెగిసి పడుతోంది.

రాణా ఏమీ అనలేక, ఆయన మాస్క్ వేపు చూస్తూ ఉండిపోయాడు.

"మేఘంలోని 'ఆకారం' అస్పష్టంగా కనబడింది. అది పూర్తిగా మాయమయ్యేసరికి ఏదో జరగకూడనిది జరిగిందనిపించింది. యింత వేగంగా ఈ వయసులో ఎప్పుడూ పరిగెట్టలేదు. నా హెల్ మీ! వాటార్ యు ఆవ్టు. హాఁ?"

రాణా చేత్తో నుదురు రుద్దుకున్నాడు.

"మై గాడ్! నాకేమీ తెలియదు....అందులోకి నడుస్తున్నాను...అంతే....దాని దగ్గరగా చేరుకోవాలన్న ఒత్తిడి నాలో బయలుదేరింది."

"అవును" అన్నాడు అశ్వత్థామ సాలోచనగా గడ్డం నిమురుకుంటూ.

"వెల్, మళ్ళీ దానివైపు చూడొద్దు. వెనక్కి తిరుగు. సక్షన్ యంత్రం దగ్గరికి పోదాం. నీ లక్ష్యం పూర్తయిందా?"

"ఎ....ఎస్....అఁ....కంటైనర్ పూర్తిగా ఫుల్ అయివుండాలి" అంటూ తటపటాయిస్తూ అన్నాడు.

"మీరంత దగ్గరగా రాకుండా వుండాల్సింది. మీ దుస్తులు కంత ప్రొటెక్షన్ యివ్వలేదేమో?...."

"ఐ నో....ఐ నో....కాని నిన్నాపక తప్పలేదు. కమెలాంగ్. ఈ నరకంనుండి బైటికి పోదాం."

యంత్రాన్ని నడిపించుకుంటూ యిద్దరు టన్నెల్ నుండి బయటపడ్డారు, నిముష నిముషానికి ఆతృతగా ఎదురు చూస్తున్న ఆర్మీ మనుషులకి రిలీఫ్ నిస్తూ.

"ఎవ్వరిథింగ్ ఓ.కే. సర్?" అడిగాడు కాప్టెన్, ముందుకు నడిచి, సక్షన్ యంత్రాన్ని అందుకుంటూ.

"ఎవ్వరిథింగ్ ఈజ్ ఫైన్" చెప్పాడు అశ్వత్థామ. "మనం యింక ఎంతమాత్రం టైం వేస్టు చేయడాన్కి వీల్లేదు. టన్నెల్ ద్వారాన్ని వెంటనే సీలుచేయాలి. కంటైనర్ కి—ప్రమాదం లేకుండా దూరంగా వుంచు. తార్వాత వాన్ లోకి లోడ్ చెయ్యొచ్చు. ముందు ఈ కార్యక్రమం ఫినిష్ చేయాలి" టన్నెల్ అరచంద్రాకారపు పైకప్పుని తలెత్తి చూస్తూ చెప్పాడు అశ్వత్థామ.

"రెండో టన్నెల్ ఉండడం నిజంగా మన అదృష్టం. కాప్టెన్ నగర్వాలా, నేను రెండో త్రోవగుండా అవతలికి చేరుకుని, మొదటి టన్నెల్ ద్వారంలో డైనమెట్లు అమర్చుతాం. మైక్రోప్లాస్మాని ట్రాప్ చెయ్యాలంటే ఒక్కసారిగా రెండువైపుల ద్వారాలు సీలుచేయాలి. బ్లాసింగ్ చేయడాన్కి ముందుగా టైమింగ్ సెట్ చేసుకుందాం రెండువైపులా ఒకేసారి జరగడాన్కి వీలుగా."

అందరూ స్పెషల్ వాన్ చేరుకున్నారు.

సుబేదార్ సైలో—డైనమైట్ పెట్టెల్ని అన్ లోడ్ చేయడం ప్రారంభించాడు. "మనకు అవసరమైన దాని

కంటే ఎక్కువ సరుకే తెచ్చాం. ఒకసారి ఫెయిలయినా ఫర్వాలేదు. ఈ స్టాకుతో చాలసార్లు ప్రేల్చవచ్చు" లోపలికి వంగి వారో పెట్టె దించాడు సైలో. మిగతా పెట్టెలకంటే చిన్నదిగా ఉందది.

"డిటొనేటర్స్! ఆ డైనమైట్లను వీటి సాయంతో ప్రేల్చవచ్చు" వివరించాడు సైలో, రాణాకి.

"ఆ కంటైనర్ ని మెయిన్ రోడ్డుకు చేరుకునే కాలి త్రోవలో ఓ వారగా ఉంచాను. ప్రస్తుతానికి అది క్షేమంగానే ఉంటుందిక్కడ. ఏ విధంగాను ప్రమాదం లేదు. ఆ యంత్రాన్ని ఎవరూ కదపలేరు కూడా, దాన్ని ఆపరేట్ చేయడం తెలియకుండా.

కాబిన్ లో తల పెట్టి టూ—వే—రేడియోని బైటికి తీశాడు నగర్వాలా.

"మీరు యిది తీసుకోండి మిస్టర్ రాణా. మనం వొకరికొకరు కాన్ స్టంట్ టచ్ లో వుండాలి. ఆపరేట్ చేయడం చాలా సులభం. సుబేదార్ సైలో డైనమైట్ లు అమరుస్తుండగా మీరు మాతో మాట్లాడవచ్చు"అన్నాడు నగర్వాలా.

రేడియో అందుకుని, పరిశీలనగా చూసి తల పంకించాడు రాణా.

"దాన్లో ఏ ఆటంకం కలగకపోతే రెండో టన్నెల్ గుండా ప్రయాణించి, అవతల మొదటి టన్నెల్ ముఖద్వారం చేరుకోవడానికి యిరవై నిముషాలు పడుతుంది" చెప్పాడు నగర్వాలా వాచీ చూసుకుంటూ. "మేం అక్కడికి చేరినతర్వాత రేడియోలో మాట్లాడి, టైం సెట్ చేసుకుందాం" అంటూ అశ్వత్థామ వైపు తిరిగాడు.

ఆయన తల పంకించి, వాన్ అధిరోహిస్తూ వెనక్కి

తిరిగి అన్నాడు "గుడ్ లక్ టు ఆల్ ఆఫ్ అజ్."

ప్రమాదంలేదని తెల్సినా రాణా దూరంగా ఉండి పోయాడు సుబేదార్ సైలో గుహాలో ముప్పై అడుగుల లోపల ప్రేలుడు సాధనాలు కనెక్టు చేస్తూ అమరుస్తుండగా.

అంతకుముందు సైలో వాటన్నిటి గురించి వివరించి రాణాకు చెప్పాడు.

"నిజానికి ఈ బ్లాస్టింగ్ తొడుగులు చాల ప్రమాదకరమైనవి" సైలో చిన్న లోహపు గొట్టాన్ని చూపుతూ "హైలీ ఎక్స్ప్లోజివ్! యిందులో లెడ్ ఎజైడ్ కొంత ఉంటుంది. మిగతాదంతా ట్రైనైట్రోటోలియన్. టి. ఎన్. టి. అంటారు. చాల సున్నితమైనది" యిబ్బందిగా ఫీలౌతున్న రాణాకేసి చూస్తూ హెల్మెట్ లో నవ్వాడు సుబేదార్ సైలో.

"డోంట్ వర్రీ సర్! నేనుండగా మీకేం పర్వా లేదు."

ఈల వేసుకుంటూ గుహాలోంచి టన్నెల్ లోకి ప్రవేశించాడు సుబేదార్, తనకో బాధ్యతాయుతమైన పని అప్పగించబడినందుకు గర్వపడుతూ.

రాణా అంతకుముందు కార్లోంచి తోసిన స్త్రీ— శవాన్ని టన్నెల్ ముఖద్వారంలోంచి బైటికి ఈడ్చాడు. ఎందుకో ఆ శవాన్ని ఆ రాతికొండలో సమాధిచేయడం అతనికి యిష్టంలేకపోయింది.

కొంతసేపటికి బైటికి వచ్చాడు సైలో, పొడుగాటి సన్నని కేబులు వైర్ చుట్టని విప్పుకుంటూ.

"లోపలి పని పూర్తయింది" అన్నాడు సంతృప్తిగా.

రాణా చేతిలోని రేడియో గరగరలాడింది.

"హల్లో కెన్ యూ హియర్ మీ మిస్టర్ రాణా?"

అశ్వత్థామ కంఠం.

రాణా ఎక్నాలెడ్జ్ చేసాడు.

"కాప్టెన్ టన్నెల్ లో వున్నాడు ప్రస్తుతం" అశ్వత్థామ కంఠం చెప్పసాగింది.

"రెండో త్రోవ ఖాళీగానే వుంది. దారిలో ఎవరూ కనబడలేదు. ప్రయాణం బాగానే సాగింది. రెండో టన్నెల్కి ఆపోజిట్ గా ఎత్తుగా వున్న రోడ్డుమీద మా వాహనాన్ని పార్క్ చేసాం. ప్రస్తుతం నేను అక్కడే నిలబడి మొదటి టన్నెల్ ముఖద్వారం వైపు చూస్తున్నాను. హౌ ఆర్ ది థింగ్స్ ఎట్ యువర్ ఎండ్?"

"సుబేదార్ సైలో, యిప్పుడే ఫ్యూజ్ వైర్ని బైటికి తీసుకొచ్చాడు. కొద్ది క్షణాల్లో సిద్ధమౌతాం."

"గుడ్. కాప్టెన్ నగర్వాలా నన్ను—సుబేదార్ కి ఓ విషయం చెప్పవల్సిందిగా కోరాడు. వైకప్పుకు సాధ్యమైనంత దగ్గరగా ఒక ఛార్జ్ని దానికి ఎదురుగా వున్న గోడక్రింద భాగంలో ఒక ఛార్జ్ని, దానికి ఎదురుగా వున్న గోడ క్రింద భాగంలో ఒక ఛార్జ్నీ అమర్చాలని చెప్పాడు. దయచేసి ఈ మెసేజ్ ని సుబేదార్ కి వెంటనే పాస్_ఆన్ చేయగలవా?"

రాణా ఆ సందేశాన్ని పొలికేక పెట్టి వినిపించాడు దూరంగా పనిచేస్తున్న సైలోకి.

సుబేదార్ తలపైకెత్తి రాణావైపు చూసి, తల వూపాడు, ఛాతీమీద చేత్తో తట్టుకొని పిడికిలి బిగించి బొటన వ్రేలు పైకెత్తి సైగ చేస్తూ.

"సుబేదార్ యింతకుముందే ఆ విధంగా చేసాడట"

మాత్ పీస్‌లో అన్నాడు రాణా.

"గుడ్....గుడ్....మనం యిక సురక్షిత ప్రదేశం వెతుక్కోవాలి ప్రేలుడుకి దూరంగా. కాప్టెన్ యిప్పుడే టన్నెల్‌లోంచి వస్తున్నాడు....మనం యిక త్వరగా పని ముగించాలి. కొద్ది క్షణాల తర్వాత మళ్ళీ నీతో మాట్లాడతాను."

టూ—వే—రేడియోలో కంఠం ఆగిపోయింది.

టన్నెల్ ముఖద్వారానికి ఎడంవైపుగా మెయిన్ రోడ్డుని కలిపే చిన్న త్రోవ మొదట్లో ఉన్న మెట్టపై నిలబడివున్న సుబేదార్‌ని కల్సుకున్నాడు రాణా.

"యిక్కడవుంటే ఏ ప్రమాదం ఉండదు సర్" అన్నాడు సైలో చేయందించి మెట్టపైకి రాణాని లాగుతూ. "టన్నెల్ బరువుగా పల్లంలోకి కూలి పోతుంది. యిటువేపు ఏ ప్రమాదం ఉండదు. కానీ ప్రేలుడుకి ఎగిరే రాళ్ళ గురించి మనం జాగ్రత్తపడాలి. అంతే."

మైక్రోప్లాస్మ శాంపిల్ ఉన్న ఆ కంటైనర్ సంగతేమిటీ?" అడిగాడు రాణా పల్లంలో టన్నెల్ ముఖద్వారానికి దగ్గర్లో వున్న మొబైల్ యంత్రాన్ని చూపిస్తూ.

"ఓహ్! దానికేం పర్వాలేదు సార్. దాన్ని ఏదీ పాడుచేయలేదు" అన్నాడు సైలో చేతిలోవున్న చిన్న పెట్టెకు ప్లాస్టిక్‌తో కప్పబడ్డ ఓ ఫ్యూజ్‌ని తగిలిస్తూ, "ఈ చేతిపిడిని ఒకసారి ప్రక్కకు తిప్పితే చాలు సార్! ఆ క్షణంలో ముఖద్వారం కప్పబడిపోతుంది."

"క్రిందకు నొక్కే ప్లంజర్ అక్కర్లేదా?" అడిగాడు ఆశ్చర్యంగా.

"ఈ మెకానిజంలో అక్కర్లేదు" సుబేదార్ నవ్వాడు.

టన్నెల్ని ప్రేల్చే ఘడియలు దగ్గరయ్యేకొద్దీ అతనిలో ఉత్సాహం ఎక్కువౌతోంది.

రేడియో మళ్ళీ జీవం పుంజుకుంది. "కాప్టెన్ నగర్వాలా హియర్! కెన్ యు హియర్ మీ సుబేదార్?"

సుబేదార్ స్పీకర్ మీదకు వంగాడు. "జీ కాప్టెన్! ఐ కెన్ హియర్ యు."

"అచ్ఛా! మేం యిక్కడ పొజిషన్‌లో వున్నాం. ఏక్ మినిట్ కౌంట్ డౌన్ ప్రారంభిద్దాం. నీ టైమర్‌ని చెక్ చేసుకో!"

సుబేదార్ తన చేతిలోని డిటనేషన్ బాక్సుమీద ఉన్న చిన్న గడియారంవైపు చూడ్డం రాణా గమనించాడు.

గ్లవ్స్ ధరించిన సుబేదార్ చేతివేలు, గడియారం పక్కగా వున్న 'కాచ్ మీద' నిలబడింది.

రేడియోలో కంఠం ఆదేశించింది. "మూడో అంకె నుండి ప్రారంభించు."

సార్జంట్ కాచ్‌ని క్రిందకు నొక్కాడు. ఎర్రటి సెకండ్ల ముల్లులో చలనం వచ్చింది.

"ఆల్ రైట్ సుబేదార్! రేడియోని తిరిగి ప్రొఫెసర్ అశ్వత్థామకిస్తున్నాను" కాప్టెన్ కంఠం పల్కింది. "అరవయ్యో స్ట్రోక్ కోసం ఎదురుచూస్తూ రెడీగా ఉండు.... గుడ్ లక్ అండ్ కీప్ యువర్ బ్లడీ హెడ్స్ డవున్."

తిరిగి రేడియో మౌనం దాల్చింది.

డయల్ చుట్టూ తిరుగుతున్న ఎర్రటి సెకండ్ల ముల్లు వైపు వశీకరణశక్తికి ఆవహించినట్లు చూడసాగాడు రాణా. (ఇంకా వుంది)